ఆశలు నెరవేరేదెన్నడో..?

- 28వ వార్డు ప్రజల గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వార్డు సమస్యలపై కౌన్సిల్‌లో అనేక సార్లు ప్రస్తావించిన కార్పొరేటర్
- చర్యలు తీసుకోని అధికారులు
- ఏడాదిగా సామాజిక భవనం, ఆరోగ్య కేంద్రం, నడక వంతెన కోసం ఎదురుచూపులు



భానోజీనగర్‌లో నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు



నెహ్రూ నగర్‌లో ఖాళీగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్



రామ్‌నగర్‌లో శిథిల స్థితిలో నడక వంతెన

టీచర్స్ కాలనీ: జీవీఎంసీ 28వ వార్డు ప్రజల గోడును కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వార్డులోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని స్థానికుల మొరపెట్టుకుంటున్నా.. వారి ఆశలు నెరవేర్చడం లేదు. కార్పొరేటర్ పల్లా అప్పలకొండ అనేక సార్లు జీవీఎంసీ కౌన్సిల్‌లో ఈ వార్డు సమస్యలపై ప్రస్తావించినా.. జీవీఎంసీ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తాజాగా జరిగిన కౌన్సిల్ సమావేశంలో సైతం ఆమె ప్రస్తావించినా ఫలితం లేదు.

సామాజిక భవనాలు లేక ఇబ్బందులు

వార్డులోని పితానిదిబ్బ, భానోజీనగర్ ప్రాంతాల్లో మల, మూత్ర విసర్జన కోసం బహిరంగ ప్రదేశాలను వినియోగించకూడదనే ఉద్దేశంతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రతి ఒక్కరి ఇంట్లో మరుగుదొడ్లు నిర్మించుకోవడంతో వీటి అవసరం లేక నిరుపయోగంగా మిగిలాయి. ఈ మరుగుదొడ్లను తొలగించి వాటి స్థానంలో సామాజిక భవనాలు నిర్మించాలని పితానిదిబ్బ, భానోజీనగర్ వాసులు కోరుతున్నారు. దీనిపై పదే పదే వినతిపత్రాలు అందిస్తున్నా.. అధికారుల నుంచి ఎటువంటి చర్యలు లేవు. వందలాది ఇళ్లు ఉన్న ఈ ప్రాంతాల్లో సామాజిక భవనం లేకపోవడంతో చిన్న చిన్న ఫంక్షన్లకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

శంకుస్థాపన చేసి ఏడాదవుతున్నా..

రామ్‌నగర్‌లోని 20 ఏళ్ల నాటి నడక బ్రిడ్జి పూర్తిగా శిథిలమైంది. దాని కింద స్థానిక రజక కుటుంబాలు దోబీఘాట్ ఏర్పాటు చేసుకున్నాయి. ఈ వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉండటంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రజకులు దోబీఘాట్‌లో దుస్తులు ఉతకాలంటేనే భయపడుతున్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను అర్థం చేసుకున్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవీఎంసీ కౌన్సిల్‌లో నడక బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులిచ్చింది. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో శంకుస్థాపన చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వార్డు కార్పొరేటర్ ఒత్తిడి మేరకు నడక వంతెనతోపాటు దోబీఘాట్ నిర్మాణానికి రూ.27 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులకు ఏడాది కిందట శంకుస్థాపన చేసినా.. నేటికీ ప్రారంభం కాలేదు.

ఆరోగ్య కేంద్రం అవసరం

రామ్‌నగర్, జై సంతోషిమాతా కాలనీ, పితానిదిబ్బ, నెహ్రూ నగర్ వంటి ప్రాంతాల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చినా వారంతా కేజీహెచ్ వంటి పెద్దాస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి. స్థానికులకు ఆరోగ్య భరోసా కల్పించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ప్రాంతంలో పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జీవీఎంసీ అనుమతుల మేరకు నెహ్రూ నగర్‌లోని ఓ ఖాళీ స్థలంలో ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించారు. స్థల వివాదం కావడంతో అవి నిలిచిపోయాయి. ఇదే నెహ్రూ నగర్‌లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ శిథిల స్థితికి చేరి నిరుపయోగంగా మారింది. 1500 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ హాస్టల్ స్థలం పూర్తిగా ప్రభుత్వానిదే. దీంతో ఈ స్థలంలో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. యూపీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించి.. రూ.70 లక్షల నిధులు సైతం కేటాయించినా.. అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లే ఆరోగ్య కేంద్రం ఇంకా ఏర్పాటు కాలేదు. జీవీఎంసీ, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపించడం వల్లే పనులు ముందుకు సాగటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనేక సార్లు కౌన్సిల్‌లో ప్రస్తావన



వార్డులోని సమస్యల పరిష్కారం కోసం కార్పొరేటర్ పల్లా అప్పలకొండ అనేక సార్లు జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తావించారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సైతం ఆమె సామాజిక భవనం, ఆరోగ్య కేంద్రం, బ్రిడ్జి నిర్మాణాల కోసం మాట్లాడి పాలకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులను వేగంగా మొదలు పెట్టి తన వార్డు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని కౌన్సిల్‌లో ఆమె కోరారు.

జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

28వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గత ఏడాది కాలంగా జీవీఎంసీ కమిషనర్‌లకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు వినతిపత్రాలను అందిస్తున్నారు. ఈ మేరకు స్పందించిన కమిషనర్ భానోజీనగర్‌లోని మరుగుదొడ్లను స్వచ్ఛ సర్వేక్షణ్ నుంచి తొలగించారు. వాటి స్థానంలో సామాజిక భవన నిర్మాణం కోసం మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి తమ వార్డులో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

మట్టి గణపతులతో పర్యావరణానికి మేలు



మట్టి విగ్రహాల వినియోగంపై లఘు నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

ఎంవీపీకాలనీ: వినాయక చవితి పండగను పురస్కరించుకుని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంవీపీ రైతుబజార్‌లో మట్టి గణపతి విగ్రహాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు వినాయక చవితి విశిష్టత, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ పలు లఘు నాటికలు ప్రదర్శించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించి తయారు చేసిన విగ్రహాల వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ కాలుష్యాన్ని కళ్లకు కట్టారు. మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం నినాదాలతో అవగాహన ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ఎంవీపీ రైతుబజార్ ఈవో వరహాలు, సహాయకుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు



చిన్నారులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఘనంగా వేడుకలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ జిల్లా మధవధార శ్రీ సత్యసాయి సేవా సమితి దత్తత గ్రామం దిబ్బపీడ మెట్టలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు గొడుగులు, దుస్తులు అందజేశారు. గ్రామస్తులు, చిన్నారులతో కలిసి కేక్ కట్‌చేయించి బాబాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు జరిగాయి. కార్యక్రమంలో సంస్థ జిల్లా గ్రామ సేవా ఇన్‌చార్జి డి.అప్పారావు, మాధవధార సమితి ప్రతినిధులు జగదీష్, నాగభూషణం, శారద, మణి, గ్రామ పెద్ద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తోటగరువు ఉత్సవ కమిటీ ఏర్పాటు

ఆరిలోవ: తోటగరువులో ప్రత్యేకంగా ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మన్యాల మహేష్, అధ్యక్షుడిగా మొల్లి రాంబాబు, కార్యదర్శిగా మొల్లి వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఒమ్మి రాంబాబుతోపాటు మరో నలుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటి నుంచి గ్రామంలో జరిగే పండగలు, ఉత్సవాలు నిర్వహిస్తామని నూతనంగా సభ్యులు తెలిపారు.

యువతి అదృశ్యం

ఎంవీపీకాలనీ: ఓ యువతి అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కోరాడ మౌనిక గాయత్రి అనే యువతి తల్లిదండ్రులతో కలిసి శివాజీపాలెంలో నివసిస్తోంది. నగరంలోని ఓ పార్లర్‌లో పనిచేస్తోంది. ఉద్యోగం నిమిత్తం ఈ నెల 21న పార్లర్‌కు వెళ్లిన మౌనిక రాత్రి ఎంతకీ తిరిగి రాలేదు. స్నేహితులు, బంధుమిత్రుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. అనంతరం ఇంట్లో పరిశీలించగా 6 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో మౌనిక తల్లి విజయలక్ష్మి ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మకుమారీల రక్తదానం



రక్తదానం చేస్తున్న బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సమాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్రహ్మకుమారీ అపరంజి పర్యవేక్షణలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో మురళీనగర్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. భారతదేశంతోపాటు నేపాల్‌లో 6 వేల సేవా కేంద్రాల్లో లక్ష యూనిట్ల రక్తం సేకరణలో భాగంగా రక్తదానం చేసినట్లు అపరంజి తెలిపారు. రక్తదానంలో బ్రహ్మకుమారీలతోపాటు మురళీనగర్ వాసులు పాల్గొన్నారు.

కూటమి పాలన మోసపూరితం



16వ వార్డులో స్థానికులకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మొల్లి అప్పారావు



28వ వార్డులో మహిళలకు కరపత్రం అందిస్తున్న పల్లా దుర్గారావు

వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. 16వ వార్డు హెచ్‌బీ కాలనీలో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు ఆయన వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించి కరపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీలకు ఆర్థికంగా చేయూత అందించారని గుర్తు చేశారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న కాపులకు కాపునేస్తం పేరుతో ఆర్థిక భరోసా కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పరిపాలన గురించి ప్రజలు తెలుసుకోవాలని, కూటమి గద్దె దిగేలా ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు చొల్లంగి నాగేశ్వరరావు, బమ్మిడి జోగారావు, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, మహిళ అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, మెట్ట సూర్యనారాయణ, నల్గొండ లోవరాజు, కొంగరాని రాంబాబు, మీసాల ప్రదీప్, సంధ్య, పార్వతి, వేణుగోపాలరెడ్డి, ఫిరోజ్, పండు, డొక్కర రాజు, లగుడు జగన్నాథం, ఆనాపు సత్యనారాయణ, చింతా వెంకటరావు, బొబ్బిలి రాంబాబు, కృష్ణ, అచ్చి కోటి, ఒమ్మి చిన్న, బి.సత్యనారాయణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటింటికీ కూటమి మోసాలు

టీచర్స్ కాలనీ: జీవీఎంసీ 28వ వార్డు బంగారమ్మ గుడి ప్రాంతంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలపై పొందుపరచిన కరపత్రాన్ని అందించి, ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు రాపాక శ్రీనివాసరావు, సంపంగి సురేష్, కోరాడ సన్యాసిరావు, పల్లా ఎర్రాజీ, కర్రి త్రినాథ్, సీరం అప్పారావు, పల్లా సూరిబాబు, తోటపల్లి శివ, పిల్ల నర్సింగ్‌రావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలూ అవసరమే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ మేయర్ హరివెంకటకుమారి తదితరులు

డాబాగార్డెన్స్: భారత నాట్య కళాంజలి డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ 11వ వార్షికోత్సవం ఆదివారం సిరిపురం జంక్షన్‌లో ఉన్న గురజాడ కళాక్షేత్రంలో వేడుకగా నిర్వహించారు. మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ పెద వీరరాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరి వెంకటకుమారి మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ఇనిస్టిట్యూట్ గురువులు సంతోషి, విజయ్ వార్షికోత్సవం నిర్వహిస్తూ విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, రుక్మిణీదేవి ఫైన్ ఆర్ట్స్ కాలేజీ సీనియర్ ప్రొఫెసర్ వసుంధర థామస్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



కేఆర్ఎం కాలనీలో వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలోని రామాలయం వద్ద శ్రీ లక్ష్మీగణపతి సంఘం గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ వారి సౌజన్యంలో ఆదివారం ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు భక్తులకు విగ్రహాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహక సంఘం అధ్యక్షులు కోయిలాడ రామలింగేశ్వరరావు, గురుమూర్తి, వెంకటరావు(రిటైర్డ్ ఎస్ఐ), డోనర్స్ సంఘం గౌరవ అధ్యక్షుడు సుబ్బిరెడ్డి, సంఘ అధ్యక్షుడు పి.వి.వి సూర్రెడ్డి, ఉపాధ్యక్షుడు పులగం సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి వీర రాఘవరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఓగిరెడ్డి వెంకటరెడ్డి, పులగం శ్రీనివాస్ రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో ఆధునిక 3ఆర్‌డీ ఎండోస్కోపిక్‌పై వర్క్‌షాప్



వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

ఎంవీపీకాలనీ: స్థానిక మెడికవర్ ఆస్పత్రిలో ఆదివారం ఆధునిక 3ఆర్‌డీ ఎండోస్కోపిక్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం, విశాఖపట్నం ఘాట్ క్లబ్, ఐఎంఏ విశాఖ బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నిష్టల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా 3ఆర్‌డీ ఎండోస్కోపిక్ విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంపై యువ డాక్టర్లు అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మెడికవర్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న థెరప్యూటిక్, విస్తృత శ్రేణి ఎండోస్కోపీ, అల్ట్రాసౌండ్, థెరప్యూటిక్ ఈఆర్‌సీపీ, కోలోనోస్కోపీ, పాంక్రియాటికోస్కోపిక్ ద్వారా రోగులకు అందిస్తున్న ఆధునిక చికిత్స విధానాలను వివరించారు. అనంతరం వైద్యులు ఎండోస్కోపీ థెరపీ చికిత్స విధానంలో వారి అనుభవాలు, నూతన చిట్కాలను పంచుకున్నారు. పూణే, విశాఖతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది వైద్య అధ్యాపకులు హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ శివ, డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ గిరిధర్, డాక్టర్ వాణి, డాక్టర్ మురళీ మోహన్, డాక్టర్ రాధిక చావన్, మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా మహాసభ

డాబాగార్డెన్స్: వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ 4వ జిల్లా మహాసభ ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఘనంగా నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రమాప్రభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాలల్లో విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించే లక్ష్యంతో గత 15 ఏళ్లుగా విశాఖ జిల్లాలో పని చేస్తున్నట్లు తెలిపారు. మహాసభలో క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.హరిత గత 3 ఏళ్లలో ప్రగతి ప్రణాళిక వివచించిన అనంతరం జోన్ల వారీగా చర్చలు జరిగాయి. బాలల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత పెంచడం, సమాజంలో వారి పాత్ర తెలియజేయడం, పిల్లల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించడం వంటి అంశాలు వివరించారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు. నూతన జిల్లా నాయకత్వం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ వేలీ ప్రెసిడెంట్ పిల్లలమర్రి రఘు, రోటరీ క్లబ్ డైమండ్ నుంచి ప్రెసిడెంట్ కామేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ నీరజ, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు దీప, సునీత, ఆసరా చారిటబుల్ సొసైటీ సభ్యులు సంజీవకుమార్, శ్రీనాథ్, ఐద్వా సెక్రటరీ సత్యవతి, ప్రజా నాట్య మండలి కార్యదర్శి చంటి, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎల్‌జే నాయుడు, ఉమామహేశ్వరరావు, వీసీసీ సభ్యులు అలేఖ్య, నిఖిల్, శశి, జోన్ కన్వీనర్లు అప్పారావు, లీలావతి, సంధ్య, సరోజిని, అరుణ, శ్రావణి, భవానీ, పుష్ప పాల్గొన్నారు.

శిథిలావస్థలో సీతాకోకచిలుకల పార్కు రహదారి



పలకలు ఊడిపోయిన పార్కు రహదారి

ఆరిలోవ: జూ పార్కులోని సీతాకోకచిలుకల పార్కు రహదారి శిథిలావస్థకు చేరింది. ఇక్కడి రోడ్డుపై అమర్చిన పలకలు ఊడిపోతున్నాయి. దీంతో సందర్శకులకు నడవడానికి ఇబ్బందిగా మారింది. నీటి ఏనుగుల ఎన్‌క్లోజర్ ఎదురుగా సుమారు 12 ఏళ్ల కిందట సీతాకోకచిలుకల పార్కు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనిలో వివిధ రకాల సీతాకోకచిలుకలు సందర్శకులను అలరించేవి. కొన్నాళ్లు ఈ పార్కు మూతపడింది. ఇటీవల దీనికి మరమ్మతులు చేపట్టి మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ పార్కులోకి ప్రవేశించడానికి నిర్మించిన పాత్‌వేపై అమర్చిన పలకలు ఊడుతున్నాయి. ఇవి పైకి లేస్తుండటంతో నడవడానికి ఇబ్బంది పడుతున్నామని సందర్శకులు చెబుతున్నారు. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని జూ అధికారులను వారు కోరుతున్నారు.

సిద్ధమవుతున్న ఆరిలోవ రైతుబజార్



ఆరిలోవ తోటగరువులో నిర్మాణం పూర్తయిన రైతుబజార్

ఆరిలోవ: ఆరిలోవలో రైతుబజార్ సిద్ధమవుతోంది. దీని ప్రారంభంలో మాత్రం స్పష్టత లేదు. ఇది ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు. ఇక్కడ గదులు, పాత్‌వేల నిర్మాణం పూర్తయింది. ప్రధాన రహదారి నుంచి రైతుబజార్ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం తాత్కాలికంగా ఇక్కడ చదును చేసి క్రషర్ పిక్క వేసి రహదారి ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందట అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన ఖాళీ స్థలంలో సుమారు అరెకరం విస్తీర్ణంలో రైతుబజార్ నిర్మాణం ప్రారంభించారు. దీని కోసం రూ.80 లక్షలు నిధులు కేటాయించారు. ఏడాది కాలంలోనే ఇక్కడ దీనికి సంబంధించిన గదుల నిర్మాణం పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా మిగిలిన కొద్దిపాటి పనులను పూర్తి చేయించలేదు. సుమారు ఏడాదిగా దీని పనులు సాగుతూ స్లాబ్‌లకు రంగులు వేయడం, లోపల పాత్‌వేల నిర్మాణం తదితర పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఇంకా పూర్తిస్థాయి రహదారి, వాహనాల కోసం పార్కింగ్ నిర్మించాల్సి ఉంది. ఈ రైతుబజార్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారనే దానిపై మార్కెటింగ్ శాఖ అధికారుల్లో కూడా స్పష్టత లేకపోవడం విశేషం. దీన్ని వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

జూలో అలరిస్తున్న హంసలు



జూ ఎన్‌క్లోజర్‌లోని రెండు కొలనుల్లో హంసల సందడి

కొలనులో హుషారుగా తిరుగుతున్న హంసలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో హంసలు సందర్శకులను అలరిస్తున్నాయి. ఇక్కడ ఉన్నవన్నీ నల్ల హంసలే. గతంలో ఉన్న తెల్ల హంసల జత అనారోగ్యంతో మృతి చెందాయి. సుమారు ఐదేళ్ల కిందట వేరే ప్రాంతం నుంచి జూ అధికారులు జత నల్ల హంసలను ఇక్కడికి తీసుకొచ్చారు. అవి వాటి సంతతిని వృద్ధిచేశాయి. ప్రస్తుతం ఇక్కడ తొమ్మిది పెద్ద హంసలతోపాటు మరో ఆరు పిల్లలున్నాయి. ఇవి వాటి ఎన్‌క్లోజర్‌లో ఉన్న రెండు చిన్న నీటి కొలనుల్లో హుషారుగా తిరుగుతూ.. వాటి పొడవైన మెడను నీటి అడుగు భాగం వరకు దూర్చి అడుగున ఉన్న గింజలు తింటూ పైకి లేవడం చేస్తూ జూకు వెళ్తున్న సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. జూ లోపలకు ప్రవేశించిన సందర్శకులకు ఎదురుగా కనిపించే మొట్టమొదటి ఎన్‌క్లోజర్ ఈ హంసలదే. దీంతో పార్కులోకి వెళ్లగానే ఈ హంసలు సందర్శకులకు స్వాగతం పలుకుతున్నాయి. ఆదివారం జూకు వెళ్లిన సందర్శకులను ఇవి అలరించాయి.

అయ్యప్ప భక్తుల సేవలో 'చిన్ముద్ర ట్రస్ట్'

సీతంపేట: అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాల ట్రస్ట్ సభ్యుల సమావేశం ఆదివారం శంకరమఠంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రాష్ట్రాలు, జిల్లాల వారీగా ట్రస్ట్ సభ్యుల సమక్షంలో కమిటీల ఏర్పాటు దిశగా ముందుకెళ్లాలని, ట్రస్టు ద్వారా చేపట్టాల్సిన సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. కొన్ని సంస్థలు తెలుగు అయ్యప్ప స్వాములకు చేస్తున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని తీర్మానించారు. తెలుగు రాష్ట్రాల నుంచి 60 శాతం భక్తులు, అయ్యప్ప స్వాములు శబరిమలకు వెళ్తున్నా.. తెలుగు వారికి సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. ఇకపై ఇలాంటి పరిణామాలు ఎదురు కాకుండా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, కేరళ ప్రభుత్వంతో, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల సహకారంతో అయ్యప్పల రక్షణ, సేవకు అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు ముందుంటుందని తెలిపారు. త్వరలో అనంతపురంలో రెండో సమావేశం ఉంటుందన్నారు. ట్రస్టు సభ్యులు పి.ఆదిమోహన్ రెడ్డి, రుద్ర కోటేశ్వరరావు, సిరిసేటి రాజేష్‌గౌడ్, బి.ఈశ్వరయ్య, కర్కా సిద్ధు, బాలు లెంకల, అనంతరావు, వైకుంఠరావు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పోలీసుల సైకిల్ ర్యాలీ



విశాలాక్షినగర్‌లో ర్యాలీగా బయలుదేరిన ఏఆర్ పోలీసులు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానం నుంచి అనకాపల్లి జిల్లా పోలీసులు ఆదివారం ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. కైలాసగిరి కూడలి నుంచి బయలుదేరి జోడుగుళ్లపాలెం నుంచి బీచ్ రోడ్డులో సీతకొండ మీదుగా సాగర్‌నగర్ వరకు ఉత్సాహంగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కీలకమన్నారు. ఆరోగ్యం దేశాన్ని బలోపేతం చేసి శక్తని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, మన్మధరావు, రమణమూర్తి, సంజీవిరావు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.